క్లుప్తంగా

ఘనంగా సీతారామ సప్తాహం



కలశ స్థాపనలో పాల్గొన్న రామసుధాకర్-ధనలక్ష్మి దంపతులు

మలికిపురం: మండలంలోని గూడపల్లి గ్రామ సుందర వారి మెరకలో వేంచేసిన సీతారామ ఆలయంలో సప్తాహ కల్యాణం శనివారం ఘనంగా జరిగింది. సుందర రామ సుధాకర్-ధనలక్ష్మి దంపతులతో అఖండ దీపారాధన, కలశ స్థాపన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ నెల 20 వ తేదీ వరకూ కల్యాణోత్సవం జరిగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మూడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

మామిడికుదురు: గోగన్నమఠం, మగటపల్లి, కరవాక గ్రామాల్లో శనివారం జనసేనకు చెందిన ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారం రథంపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, మాజీ జెడ్పీటీసీ భూపతిరాజు ఈశ్వరరాజు వర్మ, మూడు పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో..

పి.గన్నవరం: మండలంలోని జి.పెదపూడి, ఊడిమూడి గ్రామాల్లో జనసేనకు చెందిన కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నాయకులు డొక్కా నాథ్‌బాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, తాటికాయల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఈఓ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వెంకన్న సన్నిధిలో భక్తులకు రావులపాలెం అంజనీ హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ వీవీవీ నాగవర్మ ఏర్పాటు చేశారు. ప్రతి శనివారం స్వామి వారి ఆలయానికి వేలాది మంది భక్తులు రావడంతో ఎండవేడిమి భక్తులకు దాహార్తి తీర్చేందుకు శిబిరం ఏర్పాటు చేసినట్లు వర్మ తెలిపారు. శిబిరాన్ని దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ ప్రారంభించి భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఆర్‌ఓ శ్రీరామచంద్రమూర్తి

పి.గన్నవరం: ఎన్నికల విధులను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని పి.గన్నవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జెడ్పీ సీఈఓ ఎ.శ్రీరామచంద్రమూర్తి ఎన్నికల సిబ్బందికి సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గంలోని ఎన్నికల సిబ్బందికి తుది విడత శిక్షణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచించిన నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. ఎన్నికల సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. నియోజకవర్గంలో 254 మంది పీఓలు, 254 మంది ఏపీఓలు, 1003 మంది ఓపీఓలు మొత్తం 1511 మంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని వివరించారు. వీరికి మూడు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. సోమవారం సాయంత్రానికి శిక్షణ పూర్తవుతుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు షేక్ హుస్సేన్, మేరీకమ్మ, జె.విమలకుమారి, డి.లక్ష్మి ప్రమద్వర, ఎంపీడీఓ త్రిశూలపాణి తదితరులు పాల్గొన్నారు.

పలువురికి సత్కారం

పి.గన్నవరం: నరేంద్రపురం శివారు గుత్తులవారిపాలెంలోని మమత స్వచ్ఛంద సేవాసమితి కార్యాలయంలో అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పలువురిని జాన్ సత్కరించారు. ముదునూరి అక్కిరాజు ఫౌండేషన్ చైర్మన్ వర్మ, చిర్రా గోపాల్, బోనం రాజు, వరిగేటి బాలరాజు, రామకృష్ణ, జిత్తుగ రాంప్రసాద్, నల్లా పెద కాపు, రామకృష్ణ, వెర్రియ్య, రావూరి సత్యనారాయణ, కోరుకొండ నవీన్, రాజు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వరివడిగా కోతలు



పెదపళ్లలో వరి కోత కోస్తున్న యంత్రం



వరి కోత యంత్రాల ద్వారా మాసూళ్లు చేసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

- విరివిగా కోత యంత్రాల వినియోగం
- ఆశాజనకంగా రబీ పంట దిగుబడి
- శ్రీధృతి, బొండాలు రకాలే సాగు

అలమూరు: రబీ సీజన్‌కు సంబంధించి వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో వరి కోతలు ప్రారంభమయ్యాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందించడంతో పాటు సాగునీటిని సక్రమంగా అందించి నిర్ణీత సమయంలో ఎరువులు, పురుగు మందులను రైతులు వినియోగించడంతో ఈసీజన్‌లో తెగుళ్ల బెడద తప్పింది. ఇప్పటికే రబీ కోతలు పూర్తి కావలసి ఉండగా గత ఖరీఫ్‌లో వాతావరణ ప్రతికూల పరిస్థితుల వల్ల రబీ సాగు జాప్యం జరిగింది. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజవర్గాల్లోని 11 మండలంలో రబీ సీజన్‌లో సుమారు 21.04 వేల ఎకరాల్లో వరిసాగు చేయగా అందులో అత్యధికంగా అంతర్రాష్ట్ర మార్కెట్ కలిగిన 60 శాతం మంది ఎంటీయూ (1121) శ్రీధృతి, 40 శాతం మంది సన్నాలు రకమైన ఎంటీయూ (3626) బొండాలు రకం రైతులు సాగు చేశారు. తొలుతగా వరినాట్లు వేసిన పంట పక్వానికి రావడంతో సంబంధిత రైతులు ముందుగా వరి కోతలు ప్రారంభించారు.

అందుబాటులో వరి కోత యంత్రాలు

రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అన్ని మండలాల్లో వరి కోత యంత్రాలను రైతులకు పంపిణీ చేయడంతో విరివిగా వరి కోత యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. రబీ సీజన్‌లో వరి కోత యంత్రాలపై ఆధారపడ్డ సుమారు 90 శాతం మంది రైతులకు వరి కోత ధరల విషయంలో కొంత ఊరట లభించనుంది. పుంత రోడ్లు లోపల ఉన్న వరి చేలల్లో కూలీలతో, రహదారులు, పుంత గట్లు పక్కన ఉన్న చేలల్లోని మరికొంత మంది రైతులు యంత్రాలతోను వరికోతలు చేపట్టారు. పశుగ్రాసం కోసం కొంతమంది రైతులు కూలీలను వినియోగించడం భారంగా మారింది. ప్రస్తుతం రోజు కూలీ ధర రూ.900 వరకూ ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయాన్ని ఎన్‌ఆర్‌జీఈఎస్‌కు అనుసంధానం చేస్తే మరింత ప్రయోజనం ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

ధాన్యం కళ్లాలుగా మారుతున్న లేఅవుట్లు

వరి కోత యంత్రాల ద్వారా మాసూళ్లు జరిపిన ధాన్యంలో తేమ తగ్గించేందుకు వీలుగా ఆరబెట్టుకునేందుకు ప్రత్యామ్నాయ పద్ధతులు లేకపోవడంతో సమీపంలో ఉన్న లేఅవుట్లు, ప్రధాన రహదారులనే వినియోగిస్తున్నారు. యంత్రాలతో కోయడం వల్ల ధాన్యంలో తేమ అధికంగా ఉంటుంది. దీనివల్ల గిట్టుబాటు ధర వచ్చే అవకాశం ఉండదు. అందువల్ల దాదాపు వారం రోజుల పాటు ధాన్యాన్ని ఆరబెట్టవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

దిగుబడి ఆశాజనకం



రబీలో పంట దిగుబడి ఆశాజనంగా ఉంది. తెగుళ్ల బెడద కూడా తక్కువగా ఉండటంతో రైతులకు పెట్టుబడి ఆదా అయింది. ఇటీవల నిర్వహించిన పంట కోత ప్రయోగంలో పలుచోట్ల ఎకరాకు 45 నుంచి 50 బస్తాలు దాటి దిగుబడి వచ్చినట్లు నిర్ధారణ అయింది.

– ఎస్.లక్ష్మిలావణ్య, ఆలమూరు

అందుబాటులో యంత్రాలు



వరి కోత యంత్రాలు విరివిగా అందుబాటులోకి రావడంతో కోత ధర కూడా రైతులకు వీలుగా ఉంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే దిగుబడి ఆశాజనకంగా ఉండే పరిస్థితి కనబడుతుంది.

– శింగంశెట్టి దుర్గయ్య, కౌలు రైతు, పెనికేరు

తటస్థ ఓటర్లలో చైతన్యం తీసుకురావాలి



గొందిలో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమంలో సిద్ధం కిట్లను అందజేస్తున్న నాయకులు

సఖినేటిపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి తటస్థ ఓటర్ల ఓట్లు పడేలా వారిలో చైతన్య తీసుకురావాలని జేసీఎస్ మండల ఇన్‌ఛార్జ్ నల్లి మోహన్ అన్నారు. శనివారం గొందిలో బూత్‌లలో ఓటింగ్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన విధానాలపై అవగాహన సదస్సును ఆయన నిర్వహించారు. పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఒడుగు వెంకట్ అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, బూత్ కోర్ కమిటీ సభ్యులతో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం పేరుతో జరిగిన సమావేశంలో మోహన్ మాట్లాడారు. సిద్ధం కిట్లను ఎంపీటీసీ కొల్లాబత్తుల శుభాకర్, మోహన్, వెంకట్‌లు వారికి అందజేశారు. అలాగే బూత్‌లలో ఒకటి ఎమ్మెల్యే ఎన్నిక నిమిత్తం అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావుకు, రెండోది పార్లమెంట్ ఎన్నిక నిమిత్తం అభ్యర్థి రాపాక వరప్రసాదరావుకు ఫ్యాన్ గుర్తులపై రెండు ఓట్లు వేసేలా ఓటర్లకు వివరించాలని మోహన్ కోరారు. నాయకులు తాడి సహదేవ్, తిరుమాని నాగరాజు, దొండపాటి రమేష్, సంగాని నాగరాజు పాల్గొన్నారు.

సిద్ధం సభకు రాజోలు రెడీ..



మలికిపురంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి

మలికిపురం: ఈ నెల 18న రావులపాలెంలో జరిగే వైఎస్సార్ సీపీ సిద్ధం సభకు రాజోలు నియోజకవర్గం కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శనివారం మలికిపురంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులతో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్ పాల్గొనే సిద్ధం సభను విజయవంతం చేయాలని కోరారు. రాజోలు నియోజక వర్గంలో వచ్చే ఎన్నికలలో విజయం కోసం బెర్త్ కన్ఫర్మ్ చేసుకునే విధంగా రావులపాలెం సిద్ధం సభకు జనం తరలివెళ్లాలని గొల్లపల్లి సూచించారు. అందుకోసం ప్రతి కార్యకర్తా పూర్తి స్థాయిలో కసరత్తు చేయాలని సూచించారు. నియోజకవర్గం నుంచి 150 బస్సుల్లో కార్యకర్తలు రావులపాలెం వెళ్లేందుకు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రెండు గ్రామాలను ఒక యూనిట్‌గా తీసుకుని కార్యకర్తలు, నాయకులు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. సభకు వచ్చే వారికి భోజనాలు, మజ్జిగ, తాగునీటి ఏర్పాట్లు చేయాలని సూచించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీరబ్రహ్మాజీరావు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మంగెన సింహాద్రి, జెడ్పీటీసీలు బల్ల ప్రసన్నకుమారి, దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, కుసుమ చంద్రశేఖర్, కట్టా శ్రీనివాసరావు, గెడ్డం తులసీ భాస్కరరావు, సూరిశెట్టి బాబి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న దంపతులకు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శనివారం రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం అత్తిలి గ్రామానికి చెందిన అర్జుల వెంకటరావు (68) అతని భార్య అర్జుల సుబ్బలక్ష్మి (63) ఇద్దరూ దంపతులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. అర్జుల వెంకటరావు కొంతకాలంగా హార్ట్‌లో కాల్షియం పెరిగిపోవడం వలన ఆపరేషన్ చేసిన ప్రయోజనం ఉండదని వైద్యులు తెలిపారు. కొంతకాలంగా మందులు వాడుతున్నారు. ఆయన జీవితాంతం మందులు వాడాలని వైద్యులు తెలిపారు. వీరికి ముగ్గురు కుమార్తెలు అద్దింటిలో నివసిస్తున్నారు. భార్య సుబ్బలక్ష్మికి ఇటీవల పెరాలసిస్, హార్ట్ కంప్లైంట్, బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్ అవ్వడం జరిగింది. వీరి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో సాయం కోసం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థను ఆర్థిక సాయం చేయమని కోరగా ఈరోజు సభ్యుల చేతుల మీదుగా వారి మూడో కుమార్తె మహాలక్ష్మికి రూ.15 వేల ఆర్థిక సాయం ఆందజేసినట్టు సభ్యులు తెలిపారు.



సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

సంక్షేమ పాలనకే ఓటెయ్యండి



ఇసుకపూడిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు

గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి విస్తృత ప్రచారం

అంబాజీపేట: ప్రజలకు సంక్షేమ పాలనను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా మద్దతు పలికి ఓటు వేసి ఆశీర్వదించాలని పి.గన్నవరం అసెంబ్లీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు కోరారు. ఇసుకపూడి, చిరతపూడి గ్రామాల్లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అధ్యక్షతన ఎన్నికల ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. గ్రామాల్లోను ఇంటింటికీ వెళ్లి అమూల్యమైన రెండు ఓట్లను అసెంబ్లీ అభ్యర్థి తనకు, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావులకు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని వేణుగోపాలరావు కోరారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న తలంపుతో వినూత్నమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకున్న ఒకే ఒక్క వ్యక్తి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావుకు మహిళలు హారతులిస్తూ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు, కోట బేబిరాణి, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, సొసైటీ అధ్యక్షుడు బొంతు శ్రీనివాసరావు, అయినవిల్లి దేవస్థానం చైర్మన్ గుత్తుల నాగబాబు, కోట విజయరాజు, కొర్లపాటి కోటబాబు, గుత్తుల వెంకటేశ్వరరావు, వార చిట్టిబాబు, కడలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగ్గిరెడ్డి విజయానికి కృషి చేస్తాం



ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి మద్దతు తెలియజేస్తున్న కొత్తపేట వలంటీర్లు



తూర్పుపాలెంలో రాజీనామా చేసిన వలంటీర్లు

ఎమ్మెల్యేకు మద్దతుగా వలంటీర్ల రాజీనామాలు

కొత్తపేట: నియోజకవర్గంలో మళ్లీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి విజయానికి కృషి చేస్తాం.. తద్వారా రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు ద్వారా ప్రజలకు మా సేవలు కొనసాగిస్తాం.. అని వివిధ గ్రామాల వలంటీర్లు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి మద్దతుగా వలంటీర్లు మూకుమ్మడి రాజీనామా కొనసాగుతున్నాయి. దానిలో భాగంగా కొత్తపేట, వానపల్లి, వాడపాలెం, పలివెల గ్రామాల వలంటీర్లు మూకుమ్మడిగా తమ రాజీనాలను అధికారులకు సమర్పించారు. మండలంలో 410 మందికి సుమారు 360 మంది ఇప్పటి వరకూ రాజీనామాలు చేసి, శనివారం వైఎస్సార్ సీపీ అభ్యర్థి జగ్గిరెడ్డిని కలసి మద్దతు తెలిపారు. స్వతంత్రంగా ప్రజల్లోకి వెళ్లి వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి జగ్గిరెడ్డి, జగనన్న గెలుపునకు కృషి చేస్తామని అన్నారు. చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ గత 5 సంవత్సరాలు ప్రభుత్వం తరపున ప్రజలకు సేవ చేసి, ఇప్పుడు మా గెలుపునకు కృషి చెయ్యడానికి సిద్ధం అయిన వలంటీర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మలికిపురం: మండలంలోని తూర్పుపాలెం సచివాలయం-2 పరిధిలోని వలంటీర్లు శనివారం స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. జగనన్నకు తోడుగా మేము కూడా సిద్ధం అంటూ వారంతా రాజీనామా చేశారు.

వెంకన్న ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేద పండితుల స్వామికి తులసి పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటిక బెల్లం మొక్కుగా చెల్లించారు.



గుమ్మిలేరులో అలంకార భూషితుడైన వేంకటేశ్వరస్వామి

శనైశ్చరునికి భక్తుల తైలాభిషేకాలు

కొత్తపేట: మండలంలోని మందపల్లిలో శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులు తైలాభిషేకాలు, సర్వదర్శనాలు చేసుకున్నారు. దేవస్థానం ఏసీ అండ్ ఈఓ కె.విజయలక్ష్మి భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టికెట్లు, వివిధ సేవల ద్వారా దేవస్థానానికి తైలాభిషేకాల ద్వారా రూ.1,17,391, అన్నప్రసాద పథకానికి పలువురు భక్తుల ద్వారా విరాళాల రూపంలో మరో రూ.46,800తో మొత్తం రూ.1,61,191 ఆదాయం వచ్చినట్లు ఈఓ విజయలక్ష్మి తెలిపారు. సిబ్బంది, పలువురు గ్రామస్తులు అన్నప్రసాద సేవలో పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

సఖినేటిపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక మూడు తూములు సెంటర్లో శనివారం కబడ్డీ పోటీలను సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఈ కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్టు అంబేడ్కర్ యూత్ సొసైటీ సభ్యులు తెలిపారు. యూత్ సొసైటీ 42వ వార్షిక దినోత్సవం సందర్భంగా ఈ పోటీలను వారు ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ యూత్ సొసైటీ అధ్యక్షుడు కాట్రు బోనీ, పరిషత్ కోఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, స్థానికులు కుసుమ చింటూ, బళ్ల జాన్‌సుభాకర్, గొల్లమందల వినయ్, కుసుమ బంగారయ్య, కె.చిన్న, నల్లి సుదీర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి వేడుకలు

పి.గన్నవరం: పోతవరం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటాలకు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆనందరావు మాట్లాడుతూ మహనీయులు అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు బళ్ల మల్లికార్జునరావు, ఎండీ ఇస్మాయిల్, గిడ్ల శ్రీనివాస్, సీహెచ్‌బీ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట డిగ్రీ కళాశాలలో..

కొత్తపేట: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకమని స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కళాశాలలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఆ ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహానికి ప్రిన్సిపాల్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాలులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, ఐక్యూసీ కో ఆర్డినేటర్ కె.అంకమ్మరావు, ఇంగ్లీషు హెచ్‌ఓడీ సీహెచ్ నాగరాణి, ఆఫీస్ సూపరింటెండెంట్ భ్రమరాంబ, ఎస్‌ఏ జగతా వెంకటసత్యనారాయణ, జేఏ సత్యసాయిబాబా, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోతవరం ప్రాథమిక పాఠశాలలో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

సుద్దముక్కపై అంబేడ్కర్ చిత్రం



సుద్దముక్కపై చెక్కిన అంబేడ్కర్ చిత్రం

కొత్తపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని నక్కా కృష్ణప్రసాద్ అనే చిత్రకారుడు సుద్దముక్కపై అంబేడ్కర్ చిత్రాన్ని చెక్కారు. మండలంలోని అవిడి చప్పిడివారి పాలెం ఎస్‌ఆర్‌ఎస్‌వీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కృష్ణప్రసాద్ వివిధ సందర్భాలను పురస్కరించుకుని వినూత్న చిత్రాలు గీస్తుంటారు. దానిలో భాగంగా సుద్దముక్కపై అంబేడ్కర్ చిత్రాన్ని చెక్కారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల హెచ్‌ఎం కుంచే అరుణశ్రీ, సహచర ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్‌ను అభినందించారు.



కొత్తపేట డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రాజ్యాంగ రచనలతో అంబేడ్కర్ చిత్రం రూపకల్పన

ఆలమూరు: భారత రాజ్యాంగ రూపశిల్పి అంబేద్కర్ జయంతి సందర్భంగా రూపొందించిన ఆయన చిత్రం విశేషంగా ఆకట్టుకుంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అంబేడ్కర్ అధ్యక్షతన 448 ఆర్టికల్స్, 12 షెడ్యూల్స్, 25 విభాగాలు, 128 సవరణలతో రాజ్యాంగం రూపుదిద్దుకుంది. ఆ రాజ్యాంగాన్ని అంతటిని ఆకళింపు చేసుకుని తాను రచించడం ద్వారా అంబేడ్కర్ చిత్రాన్ని యార్లగడ్డ రాజారావు అనే ఉపాధ్యాయుడు తయారు చేశాడు. ఈ చిత్ర రూపకర్త రాజారావు స్థానిక కొత్తూరు సెంటర్‌లోని ఒక ప్రైవేటు పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అంబేడ్కర్‌కు రాజ్యాంగాన్ని రూపకల్పన చేసేందుకు రెండు సంవత్సరాల 11 నెలల. 18 రోజులు సమయం పడితే తనకు ఈచిత్రాన్ని రూపొందించేందుకు రెండు రోజుల, 11 గంటల, 18 నిమిషాల సమయం పట్టిందని రాజారావు పేర్కొన్నారు.



రాజ్యాంగంలోని ఆర్టికల్స్ రచనల ద్వారా రూపొందించిన అంబేడ్కర్ చిత్రం

ఉల్లాసం.. ఉత్సాహం..



ఇసుకపూడిలో డ్యాన్స్ చేస్తున్న వృద్ధ మహిళలు

అంబాజీపేట: వృద్ధులనే విషయాన్ని మర్చిపోయి తమ అభిమాన మనవడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాటకు వృద్ధులు ఉత్సాహంగా... ఉల్లాసంగా డ్యాన్స్ చేశారు. ఇసుకపూడిలో ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు ప్రచారంలో వృద్ధులు డ్యాన్స్ వేస్తూ వారి అభిమానాన్ని, ఆనందాన్ని చాటుకున్నారు. ఆ వృద్ధులు ఒక్కరే డ్యాన్స్ వేయకుండా అక్కడ ఉన్న యువకులను, మహిళలను ప్రోత్సహిస్తూ నృత్యం చేశారు. జగన్‌బాబు రావాలి.. మా బతుకుల్లో జీవిత కాంతులు నింపాలంటూ సుమారు గంటపాటు డ్యాన్స్ చేశారు. వీరి నృత్యాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా తిలకించారు.